మహాప్రస్థానం

1

హిమాచలం పాండవు లందరికీ ఎదురుగా ఒక మహా శరత్కాల మేఘంలా ప్రత్యక్షమైంది. వారందరూ ఆ పర్వత శిఖరాగ్రాలపై దృష్టులునిలిపి ఎత్తిన తల లిక దింపకుండా తదేకధ్యానంతో అలాగే సాగిపోయారు. అంతవరకూ చెక్కు చెదరకుండా మహాప్రస్థాన యాత్ర సాగించిన వారందరి శరీరాలూ హిమాచల శిఖర సందర్శనంతో ఒక్క సారిగా అలిసి సొలిసినట్లుగా దిగాలుపడిపోయాయి.

శ్రీకృష్ణ నిర్యాణం జరిగిపోగానే అర్జునుడు అనేకమైన యాతన లనుభవిస్తూ శ్రీకృష్ణుని అష్టమహిషులను, మరికొందరు యాదవ కుమారులను అతికష్టంమీద ఇంద్రప్రస్థ నగరానికి తీసుకురాగలిగాడు. మధ్యే మార్గంలో దస్యు లనేకులు యాదవులపై విరుచుకుపడి యాదవ మహిళల ననేక విధాలుగా హింసించారు. ఆ సమయంలో అనితర సాధారణమైన అతని శస్త్రాస్త్రసంపత్తి అంతా ఎందుకూ కొరగాకుండా వ్యర్థమైపోయింది.

ఆ విధమైన విధివైపరీత్యం అతని మనస్సంతా కలగించివేసింది. అటుపిమ్మట అత డొకమారు వ్యాసమహర్షిని సందర్శించాడు. కాల పురుషుని లీలలవల్లనే అవన్నీ ఆ విధంగా జరిగిపోయాయనీ, ఆ విష

యంలో విచారించడంవల్ల ప్రయోజనమేమీ లేదనీ, ఇక పాండవేయు లందరూకూడా మహాప్రస్థానానికి తరలిపోయే సమయ మాసన్నమైన దనీ వ్యాసమహర్షి అతని కాదేశించాడు. తిరిగి హస్తినాపురానికి రాగానే అర్జును డా వృత్తాంతం అంతా ధర్మరాజాదుల అందరికీ తెలియజేశాడు.

శ్రీకృష్ణ నిర్యాణవార్త విన్నప్పుడే ధర్మరాజు హృదయంలో మహాప్రస్థాన సంకల్పం బయలుదేరింది. వ్యాససందేశం వినగానే ఆ సంకల్పం మరింత దృఢపడింది. మిగిలిన పాండవులందరూ తమ సంకల్పం కూడా అదే అనీ, తా మిక ఒక క్షణమైనా హస్తినాపురంలో నిలువజాలమనీ అన్నారు.

వెనువెంటనే వారందరూ పరీక్షిత్కుమారునికి పట్టాభిషేకం చేసి, పౌరజానపదు లందరిదగ్గిరా సెలవు తీసుకొని యథావిధిగా సన్న్యాసాశ్రమం స్వీకరించి మహాప్రస్థాన యాత్ర కుపక్రమించారు.

దుర్ద్యూతపరాజితులై కేవలం కట్టుబట్టలతో పాండవు లరణ్యావాసానికి బయలుదేరినప్పుడు కూడా హస్తినాపుర పౌరు లా విధంగా విలపించలేదు! హస్తినాపురం అంతా ఆనా డొకేకంఠంతో విలపించినట్టుగా ఘోషించింది!

ధర్మరాజు వారి నందరినీ ఓదార్చి తిరిగీ వెనుదిరిగి చూడకుండా హస్తినగర ద్వారం దాటి వెళ్లిపోయాడు. అతని వెనువెంటనే భీమార్జున నకుల సహదేవులూ, ద్రౌపదీదేవీ క్రమక్రమంగా ఒకేవరుసలో నడిచి వెళ్ళిపోయారు.

హస్తినాపురద్వారం దాటగానే వారిని ఒక శునకంకూడా వెంటాడింది. మొట్టమొదట వా రెవ్వరూ ఆ విషయమే గమనించనే లేదు. పౌరజానపదులందరూ ధర్మరాజాదులందరినీ చాలదూరం వరకూ సాగనంపి తిరిగి స్వగృహాలకు తరలిపోయారు. కాని ఆ శునకంమాత్రం వారిని విడిచిపెట్టలేదు.

అనంతరం సుభద్ర, పరీక్షిత్కుమారుడు మొదలైన రాజబంధువు లందరూ ధర్మరాజాదుల దగ్గిర సెలవుతీసికొని తిరిగి హస్తినాపురానికి

మరలిపోయారు. అయినా ఆ నోరులేని ప్రాణి పాండవులందరినీ అలాగే అనుసరిస్తూ నడిచిపోయింది.

అటుపిమ్మట కొన్నిరోజులకు అగ్నిదేవుని ఆజ్ఞప్రకారం అర్జునుడు తన గాండీవంకూడా సముద్రంలోనికి విసిరివేశాడు. అది సముద్రంలో పడిపోగానే వేయిపిడుగు లొక్కసారిగా మోగినంతటి ప్రళయభీకర ధ్వని వినిపించింది. ఆ ధ్వనికా పరిసరారణ్యవృక్షాలన్నీ దద్దరిల్లిపోయాయి! అయినా ఆ ప్రాణి వారిని విడిచిపెట్టకుండా అలాగే తోకాడించుకొంటూ వారి వెనువెంటనే సాగిపోయింది. అంతటి భక్తివిశ్వాసాలతో తమ వెంట నడిచివస్తున్న దానిని కాదనడానికి వారెవరికీ మనస్కరించలేదు! పైగా వారందరూ దాని నెంతో ఆప్యాయంగా ఆదరిస్తూ తమ వెంట తోడుకుపోయారు.

ఆ విధంగా మహానదీనదాలూ, దుర్గమారణ్యాలూ దాటుకుంటూ కొంతకాలానికి వారంతా హిమవత్పర్వత ప్రాంతానికి చేరుకున్నారు.

వారందరూ నిశ్చలయోగనిష్ఠులై తదేకజ్ఞాన దృష్టితో హిమవన్నగ శిఖరా లవలోకిస్తూ నెమ్మదినెమ్మదిగా తమ మహాప్రస్థాన యాత్ర సాగిస్తున్నారు. అది ఒక నాటితో ముగిసిపోయే యాత్రకాదు. మృత్యుక్షణం వరకు నిరంతరాయంగా కొనసాగవలసిన మహాయాత్ర! మృత్యుద్వారమే ఆ యాత్ర చరమలక్ష్యం! అంతకంటె దానికి వేరే మరిఒక చరమావధి ఏమీలేదు. అయితే నిశ్చల యోగనిష్ఠులైనవారు మాత్రమే ఆ భయంకర మృత్యుద్వారం అధిగమించి విముక్తులై పుణ్యలోకాలు చేరుకోగలరు. అందువల్లనే వారంతా నిరంతనిశ్చలయోగనిష్ఠులై అచంచల వీక్షణాలతో మహాహిమాలయంవైపు నడచిపోయారు. అయితే ఆ శునకం మాత్రం కేవలం వారి యెడల ఏర్పడిన అపూర్వ భక్తివిశ్వాసాలవల్లనే ఆ విధంగా వారి వెంటనంటి సాగిపోయింది.

అంతలో ద్రౌపదీదేవి హఠాత్తుగా నేలపై పడిపోయింది. ఒక క్షణ కాలం వారంతా వెనుదిరిగి చూచారు. ఆమె ముఖంలో ఎక్కడా జీవచైతన్యం స్ఫురించలేదు! వెంటనే ఆమె మరణించింది.

తిరిగి పాండవులూ, ఆ శునకమూ అలాగే ముమ్మందుకు సాగిపోయారు. పాండవేయు లందరి హృదయాలలోను ఒక్కమారుగా

ఎన్నెన్నో పూర్వస్మృతి విద్యున్మాలిక ఉదయించాయి. అయినా వారెవరూ తమ నిశ్చలయోగ లక్ష్యం విడనాడలేదు. అందరూ అలాగే సాగిపోతున్నారు.

"ఆమె కా విధంగా యోగచ్యుతి కలగడానికీ, ఆ హఠాన్మృతికీ హేతువేమి? పాంచాలీదేవి ఎన్నడూ ఏ విధమైనటువంటి అధర్మమూ ఆచరించి ఉండలేదే?" అని ప్రశ్నించాడు భీమసేనుడు.

నిశ్చల లక్ష్యదృష్టితో పాండవులందరకీ మార్గదర్శిగా సాగిపోతున్న ధర్మరాజతని కీవిధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు:

"ఈమెకు అర్జునుని యెడల పక్షపాతం అత్యధికంగా ఉన్నది. ఆ పాపఫలమే నేడీవిధంగా పరిణమించింది!"

అని ధర్మరాజిక ఒక్కమారైనా వెనుకకు తిరిగి చూడకుండా అదే విధంగా నడిచి పోయాడు.

మరికొంత సేపటికి సహదేవుడు హఠాత్తుగా నేలపై పడిపోయాడు.

"మనందరికీ అహోరాత్రాలూ ఏమరకుండా శుశ్రూష చేసిన సహదేవకుమారుని పతనానికి హేతువేమిటి?" అని భీమసేనుని ముఖతః తిరిగి ఇంకొక ప్రశ్న బయలుదేరింది.

"తనంతటి మహాప్రాజ్ఞు డెవడూ లేడని ఇత డెప్పుడూ విర్రవీగుతూండేవాడు. ఈ పతనం దాని ఫలితమే!" అన్నాడు ధర్మపుత్రుడు.

ఆ మహాప్రస్థానం ఇంకా మరికొంతదూరం సాగింది. ఆ ఆపత్పరంపరకు మిగిలిన వారెవ్వరూ అంతగా చలించలేదు. కాని భ్రాతృకళత్రమృతి సందర్శించేసరికి నకులుని కిక నడక సాగలేదు. ఉత్తరక్షణంలో అత డొక మొదలునరికిన కదళీతరువులా కూలబడిపోయాడు.

"నకులకుమారు డెన్నడూ క్షుద్రకర్మ లాచరించలేదు! ఎన్నడూ మీమాట కెదురాడలేదు! లోకంలో ఇంతటి మహాసౌందర్యశాలి ఇంకొక డెవ్వడూ లేడని ప్రసిద్ధిపొందినవా డీసుందరుడు. ఇతని కీ విధమైన యోగభ్రంశదుర్గతి పట్టడానికి కారణమేమిటి?" అని ప్రశ్నించాడు భీమసేనుడు.

"లోకంలో మరి నాఅంతటి అందగాడింకెవడూ లేడనే అహంభావంవల్లనే ఇతనికీ దుర్గతి పట్టింది." అని ధర్మరాజలాగే ఆ నిరంతర మహాప్రస్థానయాత్రలో పడి మున్ముందుకు సాగిపోయాడు.

ద్రౌపదీ నకుల సహదేవుల మృతితో అర్జునునిలో అంతవరకూ చెక్కు చెదరకుండా నిలిచిన ధైర్యం అంతా కరిగి నీరైపోయింది. అతడిక నిలబడలేకపోయాడు. వెంటనే నేలపైబడి మరణించాడు.

"పరిహాస ప్రసంగాలలోకూడా ఎన్నడూ అనృతం చెప్పని మహానుభావుడీ అర్జునుడు! అలాంటి మహాపురుషుడీ విధంగా పడిపోవడానికి కారణమేమిటి?" అని తిరిగి ఇంకొక ప్రశ్న వినిపించింది.

"నిజమే! అయితే ఇతడొకమారు ఒక్క రోజులో శత్రువులందరిని నిశ్శేషంగా సంహరించివేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. చివరికా ప్రతిజ్ఞ నెరవేర్చుకోలేకపోయాడు. కనకనే ఇతనికీ దుర్గతి పట్టింది."

అని ఒక సమాధానం వినబడింది. ధర్మరాజిచ్చిన ఆ సమాధానం వింటూనే భీమసేనుడు భూమిమీద పడిపోయాడు. పడిపోయిన ఉత్తర క్షణంలోనే అతడిలా ప్రశ్నించాడు: "మహారాజా! చివరికి నేను కూడా నేలపై పడిపోయాను! నాకిటువంటి పతనం సంప్రాప్తించడానికి కారణమేమిటి? దయ ఉంచి నాకిది తెలియజెయ్యవలసిందని కోరుతున్నాను."

దానికి ధర్మరాజీ విధంగా ప్రత్యుత్తరం ఇచ్చాడు: 'మితిమీరి అతిగా భుజించిన దోషంవల్లనే నీకీ దుర్గతి కలిగింది. నా అంతటి మహాబలశాలి లేడనే గర్వంకూడా దానికి తోడైనది. ఇవే నీపతనానికి హేతువులు!"

అని సమాధానం చెప్పిన ధర్మరాజిక వెనకకు తిరిగి చూడలేదు. నిశ్చలమైన యోగనిష్ఠాబలంతో ధర్మపుత్రుడదే విధంగా అత్యంత నిశ్చల హృదయంతో నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ అలాగే సాగిపోయాడు. ఇక పాండవులెవరూ అనుసరించని అతని వెనువెంట ఒక్క కుక్క మాత్రమే నడిచివెళ్లింది.

అన్ని భీషణ విపత్పరంపరలెదుర్కొన్నా ధర్మపుత్రుని హృదయం కించిత్తయినా చలించలేదు. హిమాచలశిఖరం ఒక్కటే గౌరీశంకర

రూపంతో అతని హృదయంలో సుప్రతిష్ఠితమై చల్లని వెన్నెల వెలుగులు విరజిమ్మింది.

ఆ విధంగా మరికొంతదూరం సాగిపోయే సరికి అతని కట్టెదుట జాజ్వల్యమానమైన దివ్యరథం స్ఫురించింది. వెంటనే దేవేంద్రు డతని ఎదుట ప్రత్యక్షమై మేఘగంభీర స్వరంతో సుస్వాగతవచనాలు పలికి, ఆ మానవశరీరంతోనే దేవత లతన్ని స్వర్గలోకాని కాహ్వానిస్తున్నారనీ, కనక వెంటనే ఆ దివ్యరథం అధిరోహించవలసిందనీ అభ్యర్థించాడు. దానికి ధర్మరాజేమీ ఉబ్బితబ్బిబ్బైపోలేదు. సవినయంగా దేవేంద్రుని కీవిధంగా విజ్ఞప్తి చేశాడు:

"దేవేంద్రా! నా ప్రియసోదరులందరూ మార్గంలో దిక్కు తెలియని దీనులవలె మృత్యువువాత పడిపోయారు. మహారాజపుత్రి అయిన పాంచాలీదేవి అత్యంత సుకుమారి. మహారాజభోగా లనుభవించిన ఆ మహాసాధ్వి కేవలం దిక్కులేని దీనురాలివలె వట్టి నేలమైబడి మరణించింది. నా సహోదరు లందరూ పాంచాలీసహితులై నా వెనువెంటనే స్వర్గలోకానికి రావలెనని కోరుకొంటున్నాను. నాకోరిక మన్నించవలసింది."

దానికి దేవేంద్రు డీవిధంగా సమాధానం ఇచ్చాడు:

"ధర్మరాజా! నీ సహోదరు లందరూ పాంచాలీసహితులై నీకు ముందే స్వర్గానికి వేంచేశారు. మానవశరీర త్యాగం చేసిన ఉత్తర క్షణంలోనే వారందరికీ ఉత్తమలోకాలు సంప్రాప్తించాయి. నీ విక ఆచిర కాలంలోనే వారందరిని సందర్శించగలవు. మనుష్యశరీరంతో స్వర్గానికి పోయే అపూర్వ భాగ్యం పట్టిన మహానుభావుడవు నీ వొక్కడవే! ఇందువల్ల మరి వెనుకముందు లాలోచించకుండా వెంటనే ఈ దివ్యరథం అధిరోహించవలసినది!"

ఆ ప్రత్యుత్తరానికి ధర్మరా జెంతో ఆనందించి, "మహేంద్రా! పాపం, ఈ కుక్క ఎంతో భక్తిశ్రద్ధలతో మా వెంటనంటి నడిచి వస్తున్నది! దీనిని కూడా నాతోపాటుగా స్వర్గానికి తీసుకుపోవలసిందని ప్రార్థిస్తున్నాను! దీనిని విడిచి స్వర్గానికి పోవడంకన్నా మరి వేరే ఘాతుక కృత్యమేమీ లేదని అనిపిస్తున్నది!" అన్నాడు.

దానికి మహేంద్రు డిలా అన్నాడు.

"రాజా! నీవీక్షణంలో అమర్త్యుడవై నా సమానుడవైనావు! స్వర్గసౌఖ్యాలన్నీ ఇక నీ కరతలామలకాలే! ఈ కుక్కను నీ వెంట బెట్టుకు రాకపోవడంవల్ల వచ్చే ప్రత్యవాయమేమీ లేదు! మరింక దానిమాట తలపెట్టక వెంటనే ఈ రథం అధిరోహించవయ్యా!"

ఆ మాటలకు ధర్మపుత్రు డీవిధంగా సమాధానం చెప్పాడు:

"మహేంద్రా! ఇక నీవుతప్ప నా కెవరూ దిక్కు లేరని కాళ్ళా వేళ్ళా పడిన ఆశ్రితుణ్ణి విడిచిపెట్టడం అంతటి మహాపాతక మేదీ లేదనీ, అది బ్రహ్మహత్యాసదృశమైన మహాపాతకమనీ ధర్మవేత్త లుద్ఘోషిస్తున్నారు! అందుచేత తుచ్ఛమైన స్వర్గసుఖం అభిలషించి నే నీ శునకాన్ని విడిచిపెట్టలేను! ప్రాణం పోయినా ఇదే నా దృఢనిశ్చయం!"

దానిమీద శచీపతి పక్కుమని ఒక్క నవ్వు నవ్వి అతనితో ఇలా అన్నాడు:

"కుక్క ముట్టిన వస్తు వెంతటి మహత్తరమైనదైనా వెంటనే దానిని దూరంగా విసిరివేస్తున్నారు! ఈ కుక్కను విడిచిపెట్టివేశావంటే స్వర్గసుఖాలన్నీ నీ అరిచేతిలో పడుతున్నాయి! కనక దీని నింక దూరదూరంగా తరిమివేసి అనితర సాధారణమైన ఈ సశరీర స్వర్గసుఖం అనుభవించు! అదిన్నీగాక నీ సహోదరులను, ధర్మపత్నిని విడిచివేసి నీ వొక్కడివే స్వర్గద్వారం చేరుకొన్నావుగదా! నీ పుణ్యకర్మలవల్లనే నీ కింతటి అపూర్వ భాగ్యవిశేషం కలిగింది. ఇంత త్యాగం చేసిన నీకీ చివరిక్షణంలో ఇంతటి మహామోహావేశం కలగడం అత్యాశ్చర్యకరం!"

అటుపిమ్మట దేవేంద్రునికి ధర్మరా జీవిధంగా సమాధానం చెప్పాడు:

"మరణించినవా రెంతటి సచ్చారిత్రులైనా, వారి పునర్దర్శనం మరి అసంభవమే కదా! వారి నెవరూ తిరిగి బ్రతికించుకోలేరు! కనకనే నేను మరి నా సహోదరులమాట తలపెట్టలేదు! కాని ఈ శునకం నన్నే నమ్ముకొని నా వెంటనంటి చాలా దూరందాకా నడిచి వచ్చింది. శరణాగతపరిత్యాగము, స్త్రీవధ, బ్రాహ్మణస్వాపహార

ణము, మిత్రద్రోహము, ఆశ్రితపరిత్యాగము మహా ఘోరపాతకాలని ధర్మజ్ఞులు ప్రవచిస్తున్నారు. అందువల్ల నేనీ శునకాన్ని మాత్రం విడిచిపెట్టేది లేదు!''

ధర్మరాజా విధంగా తన దృఢసంకల్పం తెలియజెయ్యగానే ధర్మదేవత తన శునక స్వరూపం విడిచిపెట్టి అతని కట్టెదుట నిలబడి ఇలా అన్నది:

''రాజా! నీ ప్రాణికరుణ, సచ్చారిత్రము, నీ మేధాప్రభావము అనుపమానమైనవి! పూర్వం ఒకప్పుడు ద్వైతవనంలో యక్షసరోవర తీరంలో నిన్నీవిధంగా పరీక్షించి ఉన్నాను. అప్పుడు భీమార్జునుల కంటె నకులమహారుడే నాకత్యంత హితుడనీ, ముమ్ముందుగా అతనినే బ్రతికించవలసిందనీ ప్రార్థించావు. ఇప్పుడు కేవలం నీ వెంటనంటి వచ్చిందనే కారణంచేతనే ఈ శునకాన్ని విడిచిపెట్టేది లేదని భీష్మించుకొని కూర్చున్నావు. స్వర్గలోకంలో కూడా నీవంటి మహాపురుషులెవరూ కనిపించరు! కనకనే నీకీఅపూర్వమైన సశరీర స్వర్గం లభించింది!''

అటుపిమ్మట దేవతలందరూ ధర్మరాజును దివ్యరథంపై కూర్చోబెట్టి వెంటనే స్వర్గలోకానికి తీసుకొనిపోయారు.

దివ్యకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న ధర్మపుత్రుని చూచి దేవర్షి నారదుడీ విధంగా ప్రశంసించాడు:

''ఆహా! పూర్వరాజర్షులెవరూ మానవ శరీరంతో స్వర్గలోకంలో ప్రవేశించలేదు. ఈ పుణ్యపురుషుని కీర్తి పూర్వ రాజర్షుల కీర్తి నంతటినీ తలదన్ని వేసింది! ధర్మపుత్రా! దేవతల దివ్యభవనాలన్నీ అపూర్వ భోగభాగ్యాలతో కలకలలాడుతున్నవి! ఈ మహాభవనాలన్నీ ఎంత మనోజ్ఞంగా ప్రకాశిస్తున్నవో చూడు!''

దేవర్షి వాక్యాలన్నీ కేవలం నిర్లిప్తుడై ఆలకించిన ధర్మరాజతనితో ఇలా అన్నాడు:

''నా సహోదరులూ, ద్రౌపదీదేవీ లేని ఈ స్వర్గసౌఖ్యాలు నాకెంతమాత్రమూ రుచించవు! నాకు వారితోడిదే లోకం! నేనిప్పుడు వారున్నలోకానికే వెళ్ళిపోవాలని కోరుతున్నాను. ఇదే నా తుదికోరిక.''

దానిపై తిరిగీ దేవేంద్రుడు ధర్మజునితో ఇలా అన్నాడు :

“రాజేంద్రా! పూర్వ పుణ్యకర్మరాశి పరిణతి మూలంగానే నీ కీ మహాపుణ్యలోక ప్రాప్తి కలిగింది. ఈ పునీతసానంలో మనుష్యస్నేహాలకిక ప్రసక్తి కలగనే కలగదు! ఇంతటి మహోత్తమగతి కలిగినా నిన్నింకా మనుష్యస్వభావం విడిచిపెట్టినట్లు కనబడదు. మహారాజా! దివ్యభోగాలతో జాజ్వల్యమానంగా వెలిగిపోయే ఈ స్వర్గలోకవైభవం అంతా ఒక్కమారు కళ్ళారా చూడు! ఈ దేవత లెలాంటి దివ్యభోగాలలో ములిగి తేలుతున్నారో చూడు!”

ఆ వాక్యాలన్నీ ఆలవోకగా ఆలకించిన ధర్మరాజు తిరిగి ఒక్క నిట్టూర్పు విడిచిపెట్టి దేవేంద్రుని కిలా విన్నవించాడు :

“సురేశ్వరా! నా సహోదరులూ, పాంచాలీదేవీ కనిపించని ఈ లోకం అంతా నాకు కేవలం నిస్సారంగా కనిపిస్తున్నది. నేనిక నా సహోదరులూ, ద్రౌపదీ ఉన్నచోటుకే వెళ్ళిపోతాను. వెంటనే ద్రౌపదీదేవి కుమారులతో నివసించే లోకానికే నన్ను పోనీ!”

ఆ ప్రార్థన వినగానే దేవేంద్రుని వాక్కొక్కమారుగా స్తంభించిపోయింది! అత్యాశ్చర్య దృష్టితో ధర్మమూర్తి అయిన ధర్మజునివైపు తిలకిస్తూ అతడు కేవలం శిలామూర్తిలా నిలబడిపోయాడు!